సాక్షి
కామారెడ్డి
బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం
అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.
- 9లో ▸



రెగ్యులరైజ్ చేయాలి
రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
39.8 /18.6

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



ఇఫ్తార్ బుధ : 6:37 | సహర్ గురు : 4:38
రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

17న 'టీ సేవ్' దీక్ష



కామారెడ్డి టౌన్: కేసీఆర్ నియంత పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఈనెల 17న టీ సేవ్ పేరిట నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌టీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ నీలం రమేష్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రి పక్కనున్న వైఎస్సార్ విగ్రహం వద్ద టీ సేవ్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్ష ఉంటుందన్నారు. దీక్షను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. టీఎస్పీఎస్సీ బోర్డును రద్దు చేయాలని, పేపర్ లీకేజీపై తక్షణం సీబీఐతో దర్యాప్తు చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం సుధాకర్, పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ తాహెర్, నాయకులు రాము, సంగమేశ్వర్, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ కోసం ఒప్పందం



కామారెడ్డి అర్బన్: సాంకేతికత వినియోగం, మెలకువలకు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందించడం కోసం డిజిటల్ ఈక్విటీ ఫౌండేషన్‌తో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మంగళవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య తెలిపారు. మారుతున్న ప్రపంచంలో సాంకేతికతను ఉపయోగించడంలో మెలకువలను బోధించడానికి కళాశాల నుంచి 60 మంది విద్యార్థులను ఇంటర్న్‌షిప్ కోసం ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఓంకార్‌నాథ్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ సమన్వయకర్త ఫర్హీన్ ఫాతిమ, ఫౌండేషన్ ప్రతినిధులు చంద్రకాంత్, కిరణ్మయి, అదితి, విరించి, మెంటార్ అజారొద్దీన్ పాల్గొన్నారు.

'ఆదర్శప్రాయుడు పూలే'



కామారెడ్డి క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జ్యోతీబా పూలే జయంతి నిర్వహించారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే ఆదర్శప్రాయుడన్నారు. ఆయన సామాజిక న్యాయం కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అన్యోన్య, ఏఆర్ డీఎస్పీ ఉదయ్ కృష్ణ, ఎస్‌బీ సీఐ శ్రీనివాస్, ఆర్ఐ సుభాష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

5,235 మందికి కంటి పరీక్షలు


కామారెడ్డి టౌన్: జిల్లాలో మంగళవారం కంటి వెలుగులో 5,235 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 491 మందికి అద్దాలను అందించారు. 2,90,655 మందికి కంటి పరీక్షలు చేసి, 29,731 మందికి కంటి అద్దాలను అందించామని వైద్యాధికారులు తెలిపారు. 13,953 మందికి సంబంధించిన కంటి అద్దాలను ఆర్డర్ చేశామన్నారు.

రేపు పెన్షన్ అదాలత్

నిజామాబాద్ సిటీ : ఈనెల 13న ఉద్యోగుల పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు నిజామాబాద్ పీఎఫ్ సహాయక కమిషనర్ మధుసూదనచారి తెలిపారు. ఉదయం 11 నుంచి 11.40 గంటల వరకు ఫిర్యాదుదారులు వెబెక్స్ వెబ్‌సైట్‌లో మీటింగ్ నంబర్ 2641 441 4029, పాస్‌వర్డ్ ఈఎస్ఎఫ్1234 ఎంటర్ చేసి కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని సూచించారు.

ముందస్తుకు మొగ్గు!

- ఆస్తి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ
- ఎర్లీ బర్డ్ స్కీంను వినియోగించుకుంటున్న ఇళ్ల యజమానులు
- ఈనెలాఖరు వరకు అవకాశం



మున్సిపాలిటీలలో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించేవారికోసం ప్రవేశపెట్టిన ఎర్లీబర్డ్ స్కీంను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ముందుగానే పన్నులు చెల్లించి 5 శాతం రాయితీ పొందడానికి ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని మూడు బల్దియాల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ. 66 లక్షల ఆదాయం సమకూరింది.



కామారెడ్డిలో ఆస్తి పన్ను వసూలు చేస్తున్న బల్దియా సిబ్బంది

కామారెడ్డి టౌన్: మున్సిపాలిటీల పరిధిలో ఆస్తి పన్ను వసూలుపై దృష్టి సా రించిన అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం ఆస్తిపన్ను చెల్లించే వారిని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటోంది. ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించడానికి ముందుకువచ్చేవారికి ఐదు శాతం రాయితీ ఇస్తోంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలలో అమలు చేస్తున్న ఎర్లీ బర్డ్ స్కీం సత్ఫలితాలను ఇస్తోంది. పట్టణంలోని గృహ, వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక భవనాల యజమానులకు ఈ అవకాశం క ల్పించడంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పన్ను లు చెల్లిస్తున్నారు. ఈ ఏడాది గడిచిన పదకొండు రోజులలో మూడు బల్దియాల ద్వారా రూ. 66 లక్షల ఆస్తి పన్ను వసూలైంది. పలువురు ఎర్లీ బర్డ్ స్కీంను వినియోగించుకుని రాయితీ పొందారు. ఇంకా 19 రోజుల గడువుండడంతో చాలామంది ఈ అవకాశాన్ని వినియోగించుకునే అవకాశాలున్నాయి.

వంద శాతం వసూళ్ల కోసం..

జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి బల్దియాలున్నాయి. పట్టణ అభివృద్ధికి ప్రధాన వనరు పన్నులే కావడంతో వంద శాతం వసూళ్లే లక్ష్యంగా అధికారులు సాగుతున్నారు. మున్సిపల్ రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్‌లు వార్డులలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పా టు చేశారు. పట్టణంలో చెత్త సేకరణ ఆటోలతో వాయిస్ రికార్డు ద్వారా ప్రచారం చేస్తున్నారు. ప్రధాన రోడ్లు, చౌరస్తాలలో ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు. అయినా గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కామారెడ్డిలో 75 శాతం, బాన్సువాడలో 70 శాతం, ఎల్లారెడ్డిలో 68 శాతం వరకు మాత్రమే ఆస్తి పన్నులు వసూలయ్యాయి. వంద శాతం పన్నులను వసూలు చేయడానికి అధికారులు కష్టపడుతున్నారు.

కామారెడ్డి బల్దియాలో 27 వేలకుపైగా గృహాలున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 8.50 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలన్నది లక్ష్యం కాగా.. రూ. 6.40 కోట్లు వసూలయ్యాయి. బాన్సువాడలో 9 వేలకుపైగా గృహాలుండగా రూ. 4 కోట్ల వరకు పన్నులు వసూలు చేయాలన్నది లక్ష్యం. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 2.80 కోట్లు వసూలు చేశారు. ఎల్లారెడ్డిలో 7 వేలకుపైగా ఇళ్లుండగా.. రూ. 2 కోట్ల వరకు ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంది. కానీ రూ. 1.36 కోట్లే వసూలయ్యాయి. మిగిలిన పన్నుల వసూళ్ల కోసం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపాలిటీలలో ఎర్లీ బర్డ్ గడువు ఈనెలాఖరుతో ముగియనుంది. ఆ తర్వాత మొండి బకాయిలపై దృష్టి సారించనున్నారు. మొండి బకాయిదారులను గుర్తించి రెడ్ నోటీసులను అందిస్తామని, అయినా స్పందించకపోతే ఆస్తులను జప్తు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అభివృద్ధికి సహకరించాలి



ముందస్తుగా ఆస్తి పన్నులు చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇస్తోంది. ఈ అవకాశాన్ని ప్రతి ఇంటి యజమాని సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి. మొండి బకాయిదారులు స్పందించి పన్నులు చెల్లించకపోతే వారి ఆస్తులను జప్తు చేస్తాం. వ్యాపార సముదాయాలను సీజ్ చేస్తాం.

– దేవేందర్, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

కార్యకర్తలే పార్టీకి బలం

- సీఎం కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి
- ఆత్మీయ సమ్మేళనంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

రాజంపేట: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు. మంగళవారం బస్వన్నపల్లిలోని ఎస్‌పీఆర్‌కే పాఠశాల ప్రాంగణంలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీ జెండాను మోసిన ప్రతి కార్యకర్తను మర్చిపోలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణకు చేసిందేమీలేదన్నారు. సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాలలో ముందుకు దూసుకెళ్తోందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి బీఆర్ఎస్‌లోకి వచ్చానంటూ తనపై విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ తాను 2001 లో టీఆర్ఎస్ జెండాను మోశానని, ఆ పార్టీలోకే తిరిగి వచ్చానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల స్వరూప, జెడ్పీటీసీ కొండ హన్మండ్లు, సదాశివనగర్ జెడ్పీటీసీ నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్‌రెడ్డి, నాయకులు గడ్డం రాంరెడ్డి, నీరడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలో ఉన్న రాజంపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. 21 మందికి కల్యాణలక్ష్మి, 15 మందికి సీఎం ఆఎఫ్ చెక్కులను అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోచారం భాస్కర్‌రెడ్డి

- డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి
- బాన్సువాడలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బాన్సువాడ: రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సూచించారు. బాన్సువాడ సహకార సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ నీరజావెంకట్‌రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రె నర్సింలు, వైస్ చైర్మన్ బుల్లెట్ రాజు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, మోహన్‌నాయక్, వెంకట్‌రాంరెడ్డి, పాత బాలకృష్ణ, పోత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లంచాలకు అలవాటుపడ్డ అధికారులు



ఇస్సానగర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

- బీఆర్ఎస్ నాయకులకూ వాటా
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపణలు

బీబీపేట: రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ అధికారులు పూర్తిగా లంచాలు తీసుకోవడం అలవాటు చేసుకున్నారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు. మంగళవారం ఇస్సానగర్‌లో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుతారి రమేష్ అధ్వర్యంలో పార్టీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ లంచాలు తీసుకోనిదే అధికారులు పని చేయడం లేదని, అందులో సగభాగం బీఆర్ఎస్ నాయకులకు ఇస్తున్నారని అరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు మేలు కలిగే పనులు చాలా చేశామన్నారు. బీబీపేట మండలానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుత పాలకులు బీఆర్ఎస్ నాయకులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. దోమకొండ మండలానికి కనీసం డిగ్రీ కళాశాల తీసుకురాలేకపోయారన్నారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ వల్ల నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. గతంలో లేని ఆస్తులు ప్రస్తుతం సీఎం కేసీఆర్ కుటుంబానికి ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని ప్రస్తుత ఎమ్మెల్యే 50 ఏళ్లు వెనక్కి తీసుకుపోతున్నాడని విమర్శించారు. అభివృద్ధి చేయడం లేదు కాబట్టే గ్రామాలలో తిరగడం లేదన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌కు వీడ్కోలు పలకాలని, కాంగ్రెస్‌కు తిరిగి అధికారాన్ని అప్పగించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావ్, ప్రధాన కార్యదర్శి భూమాగౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, సర్పంచ్ పాత రాజు, నాయకురాలు రేవతి తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోండి

తాడ్వాయి: ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఆయన మంగళవారం ఎర్రాపహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు ఎనిమిది రకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించాలని వైద్యులకు సూచించారు. హాస్పిటల్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాజ్‌వీర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎంపీటీసీ జలంధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఎర్రాపహాడ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్



బీర్కూర్‌లో అదనపు కలెక్టర్ చంద్రమోహన్..

బీర్కూర్‌లో..

నస్రుల్లాబాద్: బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఉపయోగించుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం 81 మంది మహిళలకు పరీక్షలు చేశామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో భాను ప్రసాద్, డాక్టర్‌శ్రీలేఖ, సీహెచ్‌వో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

69.9 కిలోల గంజాయి పట్టివేత

పెద్దకొడప్‌గల్: అక్రమంగా తరలిస్తున్న రూ. 7 లక్షల విలువైన గంజాయి పొట్లాలను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోచారం తండా నుంచి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారం హైదరాబాద్ ఎస్‌టీఎఫ్ పోలీసులకు అందింది. దీంతో ఎస్‌టీఎఫ్ సీఐ నరేందర్ ఆధ్వర్యంలో బిచ్కుంద ఎక్సైజ్ పోలీసులు సోమవారం రాత్రి నిఘా ఉంచారు. సోమవారం అర్ధరాత్రి పోచారం తండా నుంచి రెండు బైకుల మీద గంజాయిని తరలిస్తుండగా చిన్న దేవిసింగ్ తండా సమీపంలో పట్టుకున్నారు. రూ. 7 లక్షల విలువ చేసే 69.9 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. పోచారం తండాకు చెందిన బార్దావల్ సుందర్‌ను పట్టుకున్నామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు.



గంజాయి పొట్లాలను చూపిస్తున్న పోలీసులు



భిక్కనూరు: పరీక్షలు పూర్తవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



జిల్లాకేంద్రంలో సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థినులు

ముగిసిన 'పది' పరీక్షలు



కామారెడ్డిలో పరీక్ష కేంద్రం నుంచి ఉత్సాహంగా బయటకు వస్తున్న విద్యార్థులు

పదోతరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు జరిగిన పరీక్షకు 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11,899 విద్యార్థులకు గాను 11,872 మంది పరీక్ష రాశారు. హాజరుశాతం 99.77 గా నమోదయ్యింది. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంలో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

– కామారెడ్డి టౌన్

ఆస్తులకన్నా చదువు గొప్పది



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ , వివిధ సంఘాల నాయకులు

- బాలికలకు ఉన్నత విద్య అందేలా చూడాలి
- జ్యోతీబా పూలే జయంతిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: ఆస్తులకన్నా చదువు గొప్పదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. బాలికలకు తప్పనిసరిగా ఉన్నత విద్య అందేలా చూడాలన్నారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జ్యోతీబా పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల కారణంగా వెనకబడిన తరగతుల ప్రజలకు న్యాయం జరుగుతోందన్నారు. మహనీయుల త్యాగాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేంకుమార్ సూచించారు. ఈ సందర్భంగా బాన్సువాడ జ్యోతీబా పూలే గురుకుల పాఠశాల, కామారెడ్డి జ్యోతీబా పూలే జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతిక సారథి కళాకారులు మహనీయుల త్యాగాలపై పాటలు పాడారు. జ్యోతీబాపూలే విగ్రహానికి వివిధ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో బీబీపేట ఎంపీపీ బాలమణి, దోమకొండ జెడ్పీటీసీ తిరుమల్ గౌడ్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, వివిధ సంఘాల ప్రతినిధులు సిద్ధిరాములు, బలరాం, విజయ్‌కుమా ర్, సంపత్, రాజయ్య, శ్రీకాంత్, రాజీవ్ కుమార్, నాగరాజు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెంగారంలో మద్య నిషేధం

లింగంపేట: మండలంలోని మెంగారం గ్రామంలో మద్య నిషేధం పాటిస్తున్నట్లు మంగళవారం గ్రామస్తులు తీర్మానం చేశారు. గ్రామంలో బెల్టు షాపులు నిర్వహించొద్దని గ్రామ పెద్దలు తీర్మానం చేశారు. ఈ నెల 19 నుంచి గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయాలు జరిపితే రూ.20 వేల జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సుల్లో డిప్లొమా చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ బాలుర ప్రిన్సిపాల్ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అన్ని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు ఉన్నాయన్నారు. రెండేళ్ల ఐటీఐ కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ నిర్వహించిన బ్రిడ్జి కోర్సు ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఈ నెల 20 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 300, ఇతరులు రూ.500 డీడీ తీసి ప్రిన్సిపాల్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ, మసాబ్ ట్యాంక్ హైదరాబాద్ పంపాలన్నారు. వివరాలకు 9441784849 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షల ఫీజును మే 8వరకు చెల్లించవచ్చని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో మే 10వరకు, రూ.500 ఫైన్‌తో మే 11వరకు, రూ.వేయి అపరాధ రుసుముతో మే 12వరకు, రూ.2వేలతో మే 13వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు.

కెమిస్ట్రీ టాపర్లకు డీఎస్‌టీ ఇన్‌స్పైర్ ఫెలోషిప్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీలో టాపర్లుగా నిలిచిన బి శిరీష (ఆర్గానిక్ కెమిస్ట్రీ), బి మహేశ్వరి (ఎమ్మెస్సీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ) డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) ఫెలోషిప్‌కు ఎంపికైనట్లు విభాగాధిపతి జి బాలకిషన్ తెలిపారు. ఈ ఫెలోషిప్ ద్వారా విద్యార్థినులకు ఐదు సంవత్సరాల పాటు నెలకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ఉపకార వేతనం అందుతుందని చెప్పారు. అత్యుత్తమ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. మంగళవారం వీసీ డి రవీందర్ ఫెలోషిప్‌కు ఎంపికైన విద్యార్థిని శిరీషను అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికలు



నిజామాబాద్‌నాగారం: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నాగారంలోని రాజారాం స్టేడియంలో అండర్-20 బాలబాలికలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15,16 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. వీరికి 12, 13, 14 తేదీల్లో కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ తెలిపారు.

పనులు ఆగమాగం.. రోడ్లు నాసిరకం

- నాణ్యత పాటించని కాంట్రాక్టర్లు
- క్యూరింగ్ చేయకున్నా.. ఆన్‌లైన్‌లో పూర్తయిన ఎంబీలు

'నర్సింగ్‌పల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఇటీవల చేపట్టిన రోడ్డు ఇది. గతంలోనే ఇక్కడ సీసీ రోడ్డు ఉంది. రోడ్డు విస్తరణలో భాగంగా పాత రోడ్డుకు ఆనుకుని రూ. 5 లక్షలతో కొత్తది వేశారు. ఆ రోడ్డు సక్రమంగా వేయకపోవడంతో దారి గుండా వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. క్యూరింగ్ చేయకపోగా, మార్జిన్‌కు ఇరువైపులా మొరం వేయలేదు.



మోపాల్: మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో 2022- 23వ ఆర్థిక సంవత్సరానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.2.65 కోట్లు మంజూరయ్యాయి. వీటిని 34 పనులు(రోడ్లు)గా విభజించి గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారు. ఇందులో 28 పనులు పూర్తయ్యాయి. మిగిలిన రోడ్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు మార్చి 31లోపు పూర్తిచేయాలని గడువు విధించారు. మండలంలో 70 శాతం పనులు చివరి మూడ్రోజుల్లో ఆగమేఘాల మీద చేపట్టారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు పనులను పరిశీలించి నాసిరకం ఉన్న రోడ్లకు సంబంధించి ఏ మేరకు రికవరీ చేస్తారో వేచి చూడాలి.

పూర్తయిన ఆన్‌లైన్ ఎఫ్‌టీవో..

మార్చి చివరి వారంలో మంజూరైన సీసీ రోడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు రావడంతో ఆగమేఘాల మీద కాంట్రాక్టర్లు చేపట్టారు. ఒక దశలో మిల్లర్, కంకర కొరత ఏర్పడింది. సీసీ రోడ్ల పనుల్లో గుత్తేదారులు డస్ట్ మోతాదుకు మించి, మట్టితో కూడిన ఇసుకను వాడారు. అంతే గాకుండా రోడ్డు పూర్తయిన తర్వాత క్యూరింగ్ చేయకుండానే ముగించారు. ఎక్కడ కూడా మార్జిన్‌కు ఇరువైపులా మొరం పోయలేదు. 31 లోపు పూర్తి చేయాలని చెప్పి ఆన్‌లైన్ ఎఫ్‌టీవోను 29నే క్లోజ్ చేశారు. నాణ్యత పాటించకపోయినా ఎంబీలు, ఆన్‌లైన్ ఎఫ్‌టీవోను కూడా అధికారులు పూర్తిచేశారు. కాగా ఇదే విషయమై పంచాయతీరాజ్ ఏఈ ప్రవంతి వివరణ కోరగా, నాణ్యతతో సీసీ రోడ్డు పనులు చేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

అందిన కాడికి కమీషన్లు..

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టిన 34 పనుల బాధ్యతలను సర్పంచులు, ఎంపీటీసీలకు అప్పగించారు. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో నలుగురైదుగురు ప్రజాప్రతినిధులే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తారు. చాలా పనులను కమీషన్లు తీసుకుంటూ వారికి అప్పగించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అందిన కాడికి కమీషన్లు దండుకుంటూ రోడ్ల పనుల నాణ్యతను విస్మరించారు. 5 శాతం వరకు కమీషన్లు తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒకటి, రెండు గ్రామాల్లో తాజాగా వేసిన రోడ్లు పగుళ్లు ఏర్పడినట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తండ్రి చనిపోయిన బాధతోనే పరీక్షకు..



కుమ్మరి మనోజ్

మద్నూర్: ఇంట్లో తండ్రి మృతదేహం.. మనసులో భరించలేని దుఃఖం.. మరో వైపు పదో తరగతి పరీక్ష.. అయినా దుఃఖాన్ని దిగమింగుకోని పరీక్షకు హాజరయ్యాడో విద్యార్థి. వివరాలు.. మద్నూర్ మండలం మేనూర్‌కు చెందిన కుమ్మరి మనోజ్ పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. మనోజ్ తండ్రి పరుభ తీవ్ర అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మంగళవారం అంత్యక్రియలు జరపాల్సి ఉంది. మనోజ్ మేనూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివాడు. మద్నూర్‌లోని బా లుర గురుకుల పాఠశాల సెంటర్‌లో మనోజ్ పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. మంగళవారం చివరి పరీక్ష ఉండటంతో నాన్న లేడన్న బాధను మనస్సు లో దాచుకోని పరీక్ష రాశా డు. పరీక్ష అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.

పరిశోధనలు భావితరాలకు బాటలు



శిక్షణనిస్తున్న డీన్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు ఉండాలని తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ డీన్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి సూచించారు. పరిశోధనలు భావితరాలకు, భవిష్యత్ ప్రగతికి బాటలుగా మారుతాయన్నారు. తెయూ క్యాంపస్‌లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్‌ఎస్‌ఆర్) సౌతర్న్ రీజనల్ సెంటర్, తెలంగాణ యూనివర్సిటీ భాగస్వామ్యంలో 'ఆన్‌సైట్ రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ పర్ పీహెచ్‌డీ స్టూడెంట్స్/యంగ్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్స్' అనే అంశంపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యాదగిరి మాట్లాడుతూ.. పరిశోధన అనేది సృజనాత్మకంగా జ్ఞానాన్ని పొందే పద్ధతి అని తెలిపారు. సైన్సు పరిశోధనల ఫలితాలు స్థిరంగా ఉండగా, సామాజిక శాస్త్రాల పరిశోధనల ఫలితాలు చలన స్థితిలో ఉంటాయని యాదగిరి పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్ రాంబాబు మాట్లాడుతూ.. సరైన పరిశోధనకు సరైన శాంపిల్స్ ఎంచుకున్నప్పుడే నాణ్యమైన ఫలితం వస్తుందన్నారు. సీహెచ్ ఆంజనేయులు మాట్లాడు తూ.. అనేక అధ్యయనాల తర్వాత జరిగే పరిశోధన అద్భుతమైన ఫలితాలను రాబడుతుందన్నారు. కో-ఆర్డినేటర్ పున్నయ్య, వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన పరిశోధకులు, యువ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

'ముదిరాజ్ కులస్తులను విడుదల చేయాలి'



తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ కులస్తులు

మాచారెడ్డి: చేపల చెరువు వివాదంలో అరెస్ట్ చేసిన మంతన్ దేవునిపల్లి ముదిరాజ్ కులస్తులను బేషరతుగా విడుదల చేయాలని దేవునిపల్లి ముదిరాజ్ మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహిళలు ముదిరాజ్ సంఘ నాయకులతో కలిసి మంగళవారం పోలీస్ స్టేషన్, తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడారు. ఈ నెల 7న ఇసాయిపేట గ్రామానికి చెందిన గంగపుత్రులు దేవునిపల్లి శివారులోని దేవర చెరువులో చేపలు పడుతుండగా అడ్డుకోబోతే తమపై దాడి చేశారని ఆరోపించారు. తాము ఆత్మరక్షణ కోసం ప్రతి దాడి చేశామని తెలిపారు. దీంతో మహిళలను మినహాయించి వృద్ధులు, యువకులు తేడా లేకుండా అందరిని అరెస్ట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసిన ముదిరాజ్ కులస్తులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ సంఘం నాయకులు అబ్రబోయిన స్వామి, బట్టు విఠల్, నీల కంఠం, కొరివి నర్సింలు, నాగరాజు, రాజు, కృష్ణంరాజు ఉన్నారు.

పంటల పరిశీలన



పెద్దకొడప్‌గల్: మండలంలోని చిన్న తక్కడ్‌పల్లి శివారులో జొన్న, వరి పంటలను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కంకులు విడిచిన జొన్నకు ఎలాంటి మందు పిచికారి చేయొద్దని సూచించారు. కంకులు రాని జొన్నకు పురుగు ఆశిస్తే కార్బాఫ్ హైడ్రోక్లోరైడ్ 200 గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలన్నారు. వరి కోతల సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఈవో ప్రియాంక, రైతులు ఉన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



లింగాపూర్‌లో జ్యోతీబాపూలే, సావిత్రిబాయి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ గోవర్ధన్

కామారెడ్డి రూరల్: మహనీయుల అడుగుజాడల్లో యువతతోపాటు ప్రతి ఒక్కరు నడువాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మంగళవారం లింగాపూర్‌లో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవన నిర్మాణం, స్త్రీ శక్తి భవనాలను ప్రారంభించిన అనంతరం గ్రామంలో రైతు బంధు కన్వీనర్ బండారి కల్పన రాంరెడ్డిల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతీబాపూలే సావిత్రి బాయి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ...బలహీన వర్గాలను ముందుకు తీసుకురావాలనే తపనతో జ్యోతిబాపూలే దంపతులు ఎంతో కృషి చేశారన్నారు. మహనీయుల జీవిత చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అప్పట్లోనే జాతీయ నేతలు 200 పాఠశాలలను ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే తనతోపాటు వేదికపైన ఉన్న ప్రజా ప్రతినిధులందరూ కూడా పదవులను అధిరోహించారని గుర్తు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ, కౌన్సిలర్లు పడిగే సుగుణ, కాసర్ల శ్రీనివాస్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగు మందు పిచికారి



సదాశివనగర్: రాజేంద్రనగర్ భారతీయ వరి పరిశోధన స్థానం, రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయంతో మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలో మంగళవారం డ్రోన్ ద్వారా వరికి పురుగు మందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ అధికారి వెంకయ్య, కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్త నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత ఉపయోగంతో పెట్టుబడి, సమయం ఆదా అవుతాయన్నారు. 5 నుంచి 6 నిమిషాల్లో ఎకరం పొలంలో డ్రోన్ ద్వారా పురుగు మందును పిచికారి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ సదాశివ రెడ్డి, ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో సహా వివాహిత అదృశ్యం

కామారెడ్డిక్రైం: ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యమైన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి విద్యుత్ నగర్ కాలనీలో చోటుచేసుకుంది. భిక్కనూర్‌కు చెందిన విజయలక్ష్మికి గతంలో వివాహం జరిగి భర్త చనిపోయాడు. అప్పటికే ఆమెకు ఓ కుమార్తె ఉంది. కామారెడ్డిలో ఆటో నడిపిస్తూ జీవనం సాగించే హంద్రే శైలేష్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి ఐదేళ్ల క్రితం వారు వివాహం చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు జన్మించాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈనెల 1న భర్తతో గొడవ పడిన ఆమె ఇంట్లో నుంచి ఇద్దరు పిల్లలను వెంట తీసుకుని వెళ్లిపోయింది. గతంలో సైతం ఆమె ఇదే విధంగా పలుసార్లు వెళ్లి తిరిగి వచ్చినట్లు శైలేష్ చెబుతున్నాడు. చాలా చోట్ల గాలించినా ఆమె ఆచూకీ తెలియక పోవడంతో దేవునిపల్లి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు

నిజామాబాద్‌నాగారం: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. నగరంలోని 7, 25, 26, 48, 49 డివిజన్లకు సంబంధించి కోటగల్లీ మార్కండేయ మందిరం ప్రాంతంలో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. దురదృష్టవశాత్తు కార్యకర్తలు మరణిస్తే రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ అందిస్తున్నట్లు చెప్పారు. ఆత్మీయ సమ్మేళనాలతో కార్యకర్తల్లో మరింత చైతన్యం వస్తోందని పేర్కొన్నారు. రూ.25 లక్షలతో మార్కండేయ మందిరం పునర్నిర్మాణం చేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలు అమ లు చేస్తున్నారన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టె వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలని వివరించాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పారు. మేయర్ దండు నీతూకిరణ్, సుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సిర్ప రాజు, యెనుగందుల మురళి, కంచర్ల సంతోష్, గాండ్ల లింగం, అనిల్ రావు, కృష్ణ, కార్పొరేటర్ సిరిగాదా ధర్మపురి, చింతకాయల రాజు, సిరాజ్ పాషా, సిర్ప సువర్ణ రాజు, ప్రసన్న సత్య పాల్, హనుమాండ్లు, మహేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పాముకాటుతో వివాహిత మృతి



స్వరూప(ఫైల్)

పిట్లం: పాముకాటుతో వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని గద్దగుండు తండాలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తండాకు చెందిన స్వరూప(26) సోమవారం రాత్రి తన ఇంట్లో కుటుంబ సభ్యులతో నిద్రిస్తుండగా చేతికి పాము కాటేసింది. పాటు కాటేసిన విషయం కుటుంబ సభ్యులకు చెప్పగా వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో వారు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. విష ప్రభావం ఎక్కువ అవటంతో అక్కడి నుంచి నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో స్వరూప మృతి చెందింది. మృతురాలికి భర్త, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ..

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి శివారులో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ముప్కాల్ ఏఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళను వేగంగా వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బీబీపేట: తాళం వేసిన ఇంట్లో చొరబడి నగదును ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం రాత్రి శేరిబీబీపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జంగం కళావతి తన భర్తతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లింది. వారు తిరిగి వచ్చే సమయానికి అదే గ్రామానికి చెందిన ఆస్కె స్వామి ఇంట్లోకి చొరబడి రూ.40 వేల నగదును ఎత్తుకెళ్లాడు. అతనిని పట్టుకునే యత్నం చేసినప్పటికీ తప్పించుకొని పారిపోయాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చోరీ కేసుల్లో 18 నెలల జైలు

దోమకొండ: మండల కేంద్రంలో నాలుగు నెలల క్రితం వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తికి మంగళవారం 18 నెలల జైలు శిక్ష పడినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. భిక్కనూరు మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన బురింగారి సుమన్ దోమకొండలోని మెడికల్ షాపులు, మొబైల్ షాప్‌లో దొంగతనాలకు పాల్పడగా పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరు పరిచారు. కామారెడ్డి ద్వితీయశ్రేణి న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ సదరు వ్యక్తికి 18 నెలల జైలు శిక్ష విధించారని ఎస్సై వివరించారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

నాగిరెడ్డిపేట: మండలంలోని పెద్ద ఆత్మకూర్ గ్రామానికి చెందిన కోట ఈశ్వరయ్య ఇంట్లో ఫిబ్రవరి 27న జరిగిన చోరీ కేసులో పోలీసులు ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్ విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివరాలను వెల్లడించారు. పెద్దఆత్మకూర్ గ్రామానికి చెందిన ఈశ్వరయ్య తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఆంజనేయులు సిబ్బందితో గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్ బృందాల చేత ఆధారాలను సేకరించారు. కాగా చోరీ ఘటనపై ఈశ్వరయ్య తన సమీప బంధువైన గ్రామంలోని కోడూరు సీతారాం అలియాస్ శ్రీనుపై అనుమానం వ్యక్తం చేశారని సీఐ తెలిపారు. విచారణలో భాగంగా దొంగతనం జరిగిన ఇంట్లో సేకరించిన వేలిముద్రలు సీతారాం వేలిముద్రలతో సరిపోలాయని చెప్పారు. ఈ మేరకు మంగళవారం సీతారాంను అదుపులోకి తీసుకొని విచారించగా అతను నేరం ఒప్పుకున్నాడన్నారు. నిందితుడి నుంచి ఐదు తులాల బంగారు ఆభరణాలు, 33తులాల వెండి పట్టగొలుసులతోపాటు రూ. 15వేల నగదును స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. కాగా సీతారాం గతంలో దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో జరిగిన చోరీయత్నం కేసులో నిందితుడని ఆయన వివరించారు. సమావేశంలో నాగిరెడ్డిపేట ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై ఉమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యానేరం కేసులో జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: పిల్లనిచ్చిన అత్తను పథకం ప్రకారం హత్య చేసిన కేసులో నిందితునికి కామారెడ్డి కోర్టు జీవితఖైదు విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి. రెండేళ్ల క్రితం బిచ్కుంద మండలం బండరెంజల్ గ్రామానికి చెందిన జువ్వి అంజవ్వ (44) అదృశ్యం అయినట్లు మొదట పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. కేసు న మోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రెండు రోజుల తర్వాత బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోయినప్పటికీ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, క్లూస్‌టీం బృందాల సహకారంతో హత్య చేసింది ఆమె అల్లు డు జువ్వి ప్రకాష్‌గా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి విచారించగా కుటుంబ తగాదాల నేపథ్యంలో పథకం ప్రకారం ఇబ్రహీంపేట గ్రామ శివారులోని ముదెల్లి గుట్ట వద్దకు తీసుకెళ్లి బండరాయితో మోది హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడు. అంతేగాకుండా మృతురాలి ఒంటిపై ఉన్న బంగారు గుండ్లు, మొబైల్ ఫోన్ అపహరించాడు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కామారెడ్డి మొదటి అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి లాల్‌సింగ్ నాయక్ నేరస్తునికి జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన బిచ్కుంద సీఐ కృష్ణ, అప్పటి సీఐ శోభన్, కోర్టు కానిస్టేబుల్ గోపి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వసంత రావును ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

కామారెడ్డి క్రైం: ఓ వ్యక్తి అజాగ్రత్తగా బైక్ నడపడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో బైక్‌తో పాటు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. వివరాలు.. దేవునిపల్లి గాయత్రినగర్‌లో నివాసం ఉండే అంబీర్ విజయలక్ష్మి జీవదాన్ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్‌గా పని చేస్తుంది. ఆమె తన స్కూటీపై ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన ఓ బైక్ ఢీకొంది. దీంతో ఆమె కింద పడింది. పక్కనే వచ్చిన మరో ఆటో సైతం బోల్తా పడింది. విజయలక్ష్మితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మి, నర్సయ్య, సుప్రియ, ఆటో డ్రైవర్ గడ్డం బాలయ్యకు గాయాలయ్యాయి. బైక్‌ను అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిని భిక్కనూర్ మండలం తిప్పాపూర్‌కు చెందిన విజయ్‌కుమార్‌గా గుర్తించారు. అతనికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

కారు బోల్తా



ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులో మంగళవారం కారు బోల్తా పడింది. గ్రామానికి చెందిన సూర కిశోర్ కారులో వెళ్తుండగా అదుపు తప్పి పంట పొలాల్లో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారు డ్రైవ్ చేస్తున్న సూర కిశోర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.